ఊహాచిత్రణ (పెద్దకథ)

# 'కీర్తిశేషుల లోకంలో'

శ్రీ పి. యస్. శాస్త్రి

హఠాత్తుగా మెలకువ వచ్చింది నాకు. కళ్ళువిప్పా. చుట్టూ అంతా కొత్తగావుంది. సినిమాలలో ఇంద్రలోకం సీనులావుంది. మేఘాలమధ్య గాలిలో తేలుతున్న యిళ్ళు, రోడ్లు. ఒళ్ళు గిల్లుకుని చూశాను. నొప్పి తెలిసింది. అయితే కలగనటం లేదు అని నిశ్చయించుకున్నాను. ఇక్కడి కెలా వచ్చానా అని ఆశ్చర్యపడుతూ ముందుకు నడిచాను.

"పాపం కుర్రాడే! ఇంకా చెప్పుకోతగినవేం రాయనేలేదు అప్పుడే మనతో చేరిపోయాడు," ఎవరిదో వో కంఠం చెట్ల చాటు మంచి జాలిగా వినిపించింది.

ఆ అన్నదెవరో ఎవరిగురించి అంటున్నారో నాకేం అర్థం కాలేదు. ఎవరైతేనేం ఇక్కడా తెలుగు మనుషులున్నారు అని సంతోషంతో గబగబా ముందుకునడిచాను. అ ప్రక్కనే కొన్ని చేలున్నాయి.

"చేలుదాటగానే పెద్ద పచ్చగడ్డి మైదానం. అడుగు ఎత్తు ఎదిగిన గడ్డిపోచలన్నీ గాలికి తలలాడిస్తున్నాయి. మైదానం మధ్యలో జట్లుగా సర్వీచెట్లు జెడలు విరబోసుకున్నట్లుగా పలకరించుకుంటూ మెదుల్తున్నాయి. వాటిని ఆనుకుని పెద్ద మామిడితోపు."

అక్కడ వొకాయన పంచె, లాల్చీ ధరించి విశ్రాంతిగా నేలమీద పడుకుని ఆకాశంలోకిచూస్తున్నాడు. ఆయన ప్రక్కనే వొకామె తనూ ఓ చేతిమీద వొరిగి పడుకుని "అవునుపాపం" అంటోంది. నొక్కుల నొక్కుల జుట్టున్న ఆవ్యక్తిని ఎక్కడో రీలగా చూపిన జ్ఞాపకం కదుల్తోంది.

"సన్నటి పొడుగాటి చేతులు. మొనలన్నా సర్దుకోని భుజాలు. మరో శరీరానికి వుద్దేశింపబడినదానిలా కనబడే సన్నటి నడుం. సన్న గిలటం మానుకుని వ్యాపించినచోట ఏచీర పడేసినా చిలక్కొయ్యలా పట్టుకునే వొంకర. వికసించటం ప్రారంభించినట్లుగావుండి స్ఫుటమైన ఆకృతి తెచ్చుకోని మొగపిల్లాడి రొమ్ములు. పూర్ణచంద్రుడికి అడ్డంవచ్చిన పల్చటి మేఘంలాంటి మెత్తటి శరీరచ్ఛాయ."

నేను దగ్గరకు రాగానే ఆవిడ లేచికూర్చుని నన్నుచూసి నవ్వింది. "చంధమామ సిగ్గుపడి మేఘాల్ని ముసుగేసుకుంది. వేళ్ళు లేకుండానే వుద్భవించి వృద్ధిపొందిన లతలా" ఆమె పల్చగా నవ్వింది. ఆయన దయగా జాలిగా నాకేసి చూసారు.

తెలిసీ తెలియనట్టున్న ఆయనకేసిచూసి సంకోచిస్తూనే "నమస్కారం" అన్నాను.

"నమస్కారం, నమస్కారం. రాకూర్చో! కోమలీ కొద్దిగా పక్కకు జరుగు" అన్నారాయన ఆదరంగా.

కోమలా? ఆశ్చర్యంగా ఆయనకేసి చూసాను. ఆయన ఆవిడ కేసిచూసి చిలిపిగా నవ్వుతున్నారు. కొంపదీసి యీాయన బుచ్చిబాబు కాదుకదా అనుకున్నాను.

"కాకపోవటమేమిటి? బుచ్చిబాబునే!" నామనసులో భావాన్ని చదివినట్లు కొంటెగా నవ్వుతూ అన్నారాయన.

ఎప్పుడో చనిపోయిన బుచ్చిబాబుగారు ఇప్పుడు నాకు కనబడటమేమిటి? ఇది కలా, యింద్రజాలమా? నాలో నేను తర్కించుకుంటున్నా.

"మీరు...మీరు..." అని అడగటానికి తటపటాయిస్తున్నా.

"అవును! నేనే! కీర్తిశేషుల లోకం యిది!" నవ్వారాయన.

"అయితే...నేను...నేనుకూడా..."

"అవును! పాపం చిన్నవయసులోనే నీకు ఆ దురదృష్టం..."

నాకు దుఃఖంతో, భయంతో స్పృహతప్పి క్రిందపడిపోయాను. ఎంతసేపు గడిచిందో తెలీదు. మెలకువ వచ్చి కళ్ళు తెరిచేసరికి ఎవరో వొకాయన నాభుజంతటి "ఏరా అబ్బీ! ఇప్పుడు వొంట్లోకొంచెం తేలిగ్గా వుందా?" అని కుశలప్రశ్నలడుగుతున్నారు.

నుదుట విభూదిరేఖలు. మధ్య ఎర్రని కుంకంబొట్టు. గోష్పాదమంతశిఖ. మెడలో రుద్రాక్షమాలలు. కర్ణకుండలాలు. భుజంమీద కాశ్మీరు దుశ్శాలువ. అచ్చంగా అప్పుడెప్పుడో మల్లాది రామకృష్ణశాస్త్రిగారి కథకు బాపూవేసిన బొమ్మలా వున్నారు. ఆయన కళ్ళల్లో వాత్సల్యం పుట్టిపడుతోంది. ఆయన ప్రక్కనే వొకామె నొంగి నిలబడి నావైపు ఆదుర్దాగా చూస్తోంది.

"ఆమె రూపుకు మెరుపుతీవె. వేయి దివిటీల తళుకుతో, వెన్నెలంత కులుకుతో, నిలువుపాపిటతో, నిండు వాల్జడతో వుంది".

"ఎలావుందిప్పుడు ?" దయగా అడిగిందామె.

"ఆమె పెదవి కదిలితే కెంపులు మురిసేను. కన్నార నవ్వితే నీలాలు కురిసేను. మనసార పలుకరించగా మాణిక్యాలు మెరసేను." తళుక్కున వొక వర్ణన నా మనసులో మెరిసింది!

సిగ్గుపడి లేచికూర్చున్నాను.

ఆ ప్రక్కనేవున్న బుచ్చిబాబుగారు "ఫరవాలేదు! ఇంక తేరుకుంటాడు! షాక్ తట్టుకోలేక పోయాడు" అన్నారు.

కోమలి నవ్వింది.

బుచ్చిబాబుగారివైపు తిరిగి ఆ బ్రహ్మవర్చస్సు తొణికిసలాడే వ్యక్తివైపు చూపించి "ఎవరండి వీరు" అని అడిగాను.

"నన్నే గుర్తుపట్టలేదురా అబ్బీ?" ఘొల్లున నవ్వారాయన.

"ఆయనెవరో తెలీకుండానే నీ 'కథకుని జ్వరంలో' అంత పొగిడావా?" బుచ్చిబాబుగారు కొంటెగా నవ్వారు.

ఎవరైయుంటారు? అందులో చాలామంది ప్రఖ్యాత ఆంధ్ర కవుల్ని, కథకుల్ని పొగిడాను. ఎవరీయన?...శ్రీనాథుడా, ధూర్జటా? ఎవరు...ఎవరు?...నాకేం తోచలేదు.

"వచన రచనా మేస్త్రి...సాహో రామకృష్ణశాస్త్రి" చిన్నగా అన్నారు బుచ్చిబాబు.

ఉలిక్కిపడ్డాను. మళ్ళీ ఆయనకేసి పరీక్షగా చూశాను.

"కాని శ్రీ శాస్త్రిగారిని లాల్చీ, పంచె, కండువాలతో, చేతిలో జేబ్‌బాగ్‌తో వున్నట్టు ఫోటోల్లో చూశాను. ఈయన ఇలా వున్నారేమిటి?" అనుమానంతో ఆయనవైపు చూస్తూ అడిగాను.

"అది 'పై వేషం!' ఇది 'మనస్సులో వేషం'!" బుచ్చిబాబు నవ్వారు

"మరి ఆ ప్రక్క..." నసిగాను.

"ఆవిడా..." ఆగారు బుచ్చిబాబుగారు.

"రంభ చెల్లెలే రాకేందువదన! గుర్తొచ్చిందిరా అబ్బీ! ఆమె రాకేందు వదన" మల్లాదివారు ఆప్యాయంగా అన్నారు.

ఆవిడ అందానికి ముగ్ధుణ్ణై కంటికొనలనుంచి చూస్తున్నాను.

ఇంతలో ఎవరో అక్కడకు పరుగు పరుగున వచ్చారు. "ఏయ్! నేను యాంటీనాచ్‌ని! నన్ను వదలమంటూంటే వినవేం?" అని వగురుస్తున్నారాయన.

"తెల్లటి పంచె. నల్లటి పొడుగుకోటు, ఆ కోటుమీద ఆకుపచ్చని జలతారు శాలువా, శిరస్సున తేజోమండలంలాగ నిండైనపాగా, పరిణత వయస్కతకు సూచనగా తలతిండుల వ్యాయంగా వుండిన గుప్పెడేసి మీసాలు."

ఆ వెనుకనే వొకావిడ నవ్వుతూ ప్రవేశించి "చాల్లెండి పంతులుగారూ! భూమిమీద వేషంవేసినన్నాళ్ళు వేశారు. ఇంకా ఇక్కడ కూడానా?" అంటూ ఆయన దగ్గరకు వెళ్ళింది.

సుందర స్వరూపం. ఒత్తైన నల్లటి జుట్టు. నిడుపైన వాల్జడ. నడుమున వొడ్డాణం. మెడలో కంటె. ఆవిడ దగ్గరకొచ్చిన కొద్దీ ఆయన "పిల్లా యడంగా నిలబడి మాట్లాడు!" అన్నారు.

"మీ అందానికి మేము తెనుగువాళ్ళము చాలమో?" కోపం అభినయించిందావిడ.

మల్లాదివారు, బుచ్చిబాబు, కోమలి రాకేందు వదనా, అంతా నవ్వారు. నాకూ నవ్వొచ్చి నవ్వాను.

"ఒకనిర్ణయంమీద నిలవని మనిషిని ఏం నమ్మను?" చిరాకుగా అన్నారాయన.

"ఇంత రసికులయ్యుండీ నా మనసు కనిపెట్ట జాలినారుకాదు గదా?" ఆవిడ బాధగా అంది.

"అదికాదు మధురం..." ఇబ్బందిగా కదిలారాయన.

"ఏమండీ ఆవిడ..." అని బుచ్చిబాబుగారితో చెప్పబోయాను.

"రాణా డైమను రాణి,
రాణా యిస్పేటు రాణి, కళావ
ఠ్ఠూరాణా ఆఠీనాణీ
రాణి యనవమ్మధుర వాణె రాజుల రాణీ!"
అని బుచ్చిబాబుగారు నవ్వారు

"ఇతే ఆయన గురజాడ అప్పారావుగారా?" సంభ్రమంతో మెల్లి గా అన్నాను.

"అవునయ్యా! అప్పారావునే! నువ్విక్కడికి కొత్తగా వచ్చినట్టున్నావు!" అని నావైపు చూసి అని, బుచ్చిబాబుగారితో "యవరన్నా మహానుభావులు?" అన్నారు ఆయన!

బుచ్చిబాబు "మన అభిమాని!" అన్నారు నవ్వుతో.

నాకు తల తిరిగిపోయింది. ఇది కీర్తిశేషులలోకం! బాగానే వుంది. ఇక్కడ నా అభిమాన రచయితలు కనిపించారు! బాగానేవుంది. కాని వారి రచనల్లో కధానాయికలు యిక్కడెలా వున్నారు? ఆత్రుత ఆపుకోలేక బుచ్చిబాబుగారిని అడిగేశాను.

"ఓస్! అదా! నువ్వభిమానించిన రచయితలం కనుక నువ్విక్కడికి రాగానే కనిపించాం. ఇంకా మా పేర్లు పాఠకులు మరచిపోలేదు కనుక భూమికి దగ్గరగానే వున్నాం. క్రమక్రమంగా పాఠకులు మమ్మల్ని మరచిపోయినకొద్దీ పైపైకి పోతాం. ఇంక నాయికలు అంటావా...నిజజీవితంలోవున్న వ్యక్తుల్ని గురించి రాశాం కనుకనే వాళ్ళూ యిక్కడ కనిపించారు!" నవ్వుతూ అన్నారాయన.

ఈయన చెప్పిన దాన్నిగురించి ఆలోచిస్తున్నాను. ఇంతట్లో ఏవో దివ్యనీరవ గంధర్వగానాలు వినిపించాయి. ఒకాయన సిల్కులాల్చీ, గ్లాస్కోపంచె ధరించి చేతిలో వో పుస్తకం పట్టుకుని నడచి వస్తున్నాడు. చాలా రూపసి!

ఆయన ముందూ వెనకా "ఆకాశంమీద అప్సరసలు ఒయ్యారంగా పరుగులెత్తుతున్నారు, వారి పాదాల తారామంజీరాలు ఘల్లు ఘల్లుని మ్రోగుతున్నాయి, వారి ధమ్మిల్లాల పారిజాతాలు గుత్తులు గుత్తులై వేలాడుతున్నాయి, వారు పృథు వక్షోజ నితంబలై యౌవన ధనుస్సుల్లా వంగిపోతున్నారు".

వాళ్ళు ఆయన్ని చూసి "చూడు వీడు, అందమైనవాడు, ఆనందం మనిషైనవాడు, కలల పట్టుకుచ్చు లూగుతున్న కిరీటం ధరించాడు, కళ్ళచివర కాంతి సంగీతగీతాన్ని రచిస్తున్నాడు,ఎర్రని పెదవులమీద, తెల్లని నవ్వుల వీణల్ని మీటుతున్నాడు, ఎవరికీ దొరకని రహస్యాల్ని వశపరచుకున్నాడు, జీవితాన్ని ప్రేమించినవాడు, జీవించడం తెలిసినవాడు, నవనవాలైన ఊహావర్ణార్ణవాలమీద ఉదయించిన సూర్యుడు, ఇతడే సుమీ మన ప్రియుడు, నరుడు మనకి వరుడు"అనుకుంటున్నారు.

ఆలా అంటూ వదలకుండా ఆయన వెంటపడ్డారు.

ఆయన "మీ కొత్త సింగారమ్ము వలదు, ఉదాత్త సురభిళాత్త శయ్యా సజ్జితమ్ము వలదు, రసప్లావితము వలదు, చిత్రశిల్ప కవితా ప్రసక్తి వాంఛింపను, తత్వమూర్త వాదోక్తి చరింపను, సుందర వధూ కదుష్ణ పరిరంభముల రసింపను..." అని విసుక్కుంటున్నాడు.

"ఏమండీ వాళ్ళ మాటలన్నీ బాలగంగాధర తిలక్ కవితా భాగాలుగా లేవూ?" బుచ్చిబాబుగారితో మెల్లిగా అన్నాను.

"ఆహ! హ్హాహ్హా!" బుచ్చిబాబు ఫెళ ఫెళా నవ్వారు.

"అతను బాలగంగాధరుడే! 'శశి మానస ప్రియ'కోసం వెతుకుతున్నాడు!" అన్నారు.

ఇంతలో ఆ ప్రక్కనున్న వో చక్కని సన్నజాజి పందిరికింద వో స్నాప్నిక్ సురవధూటి నిలబడి "శశీ" అని పిలిచిందాయన్ని.

"మళ్ళీ వస్తా"నన్నట్టుగా బుచ్చిబాబుగారివైపు చూసి చెయ్యూపి అటు వెళ్ళారాయన.

బుచ్చిబాబు నవ్వారు.

"బాలగంగాధరతిలక్ మరణించినప్పుడు బుచ్చిబాబు ఆయన సంస్మరణగా వొక వ్యాసం రాసారు. ఆ తరువాత వొక సంవత్సరం తిరగకుండానే ఆయనగురించి మిగిలిన వాళ్ళు శ్రద్ధాంజలులు సమర్పించడం దారుణంగా అనిపించింది నాకు" అన్నాను.

"అదే జీవితంలోని'ఐరనీ!" గంభీరంగా అన్నారాయన.

"సరేగాని మన పాతలోకపు సంగతులేమిట్రా అబ్బీ?" మల్లాది రామకృష్ణశాస్త్రిగారు వాత్సల్యంతో ప్రశ్నించారు.

"మా సినిమారెడ్డి బాగున్నాడయ్యా?" బుచ్చిబాబు అడిగారు.

సినిమా రెడ్డా? సినిమాలలో చాలామంది రెడ్లున్నారు. ఏ రెడ్డి అయుంటాడు యీయన అని ఆలోచిస్తున్నాను.

"అదేనయ్యా సి. నా. రెడ్డి! నేను యిక్కడికి వచ్చే సరికే సినిమా పాటలు జోరుగా రాస్తున్నాడుకదా! అందుకని అలా అన్నా!" నవ్వుతూ అన్నారు బుచ్చిబాబు.

"ఓ! ఆయన బ్రహ్మాండంగా ఉన్నారండి. ఆయన రాయగా మిగిలిన పాతికవంతు పాటల్ని మిగిలిన శ్రీ శ్రీ, ఆరుద్ర, ఆత్రేయ వగైరాలు పంచుకుని రాస్తున్నారు. ఇప్పుడాయన సినీఫీల్డులో చాలా ముఖ్యమైన వ్యక్తి. సినిమా విడుదలకుముందు ఏర్పాటుచేసే ప్రివ్యూలు, ఇంటర్వ్యూలలోను, సినిమాల శతదినోత్సవాలలోనూ, కంపీరర్ (సభా నిర్వాహకుడుగా)గా ఉండి సభల నదరగొట్టేస్తున్నారు. అందులో యీమధ్య హైదరాబాదు మహానగరంలో రామారావు, నాగేశ్వరావు గారల స్టూడియోలు కూడా వెలవటంతో మరీ బిజీగా ఉన్నారు." నా సినిమా పరిజ్ఞానాన్ని వెళ్ళబోస్తున్నాను ఉత్సాహంగా.

"ఇంక కవిత్వం రాయడం మానేశాడేమిటి?" మల్లాదివారు బాధపడుతూ అడిగారు

"మీరు సినిమాలలో వుంటూనే ఆఖరిరోజుల్లో సాహితీ సౌరభం వెదజల్లే మంచి రచనలు చేసారు. అందుకని అందరూ అలాగే వుండాలని మీ ఊహ! కాని యీ రోజుల్లో సాధారణంగా "సాహిత్యాంతాని సినిమా!" గమ్యం, లక్ష్యం, ఆదర్శం, అన్నీ, యీ రోజుల్లో తెలుగు కవికి సినిమాకి పాటలు మాటలు రాయటం! అంతే బుచ్చిబాబు అన్నారు నవ్వుతూ!

"లేదు! లేదు! ఈయన వదలకుండా కవిత్వం కూడా రాస్తున్నారు. వారపత్రికల్లో వరసగా అచ్చవుతున్నాయి. వాటిని ఏడాదికో సంపుటంగా అచ్చేస్తున్నారని, మరుపూరు కోదండరామరెడ్డి గారు వో పుస్తక సమీక్షలో వ్రాసారు కూడాను! ఆయన వో కవితా సంపుటానికి కేంద్ర ప్రభుత్వం బహుమతి వచ్చింది" అన్నాను.

"ఎలాగైనా రెడ్డి తెలివైనవాడు! సవ్యసాచిలా సినిమా సాహిత్యాన్ని, మామూలు సాహిత్యాన్ని, ఎడా పెడా రాసి పారేస్తున్నాడు" మెచ్చుకోలుగా అన్నారు బుచ్చిబాబు.

"అది సరేకాని నా కన్యాశుల్కం నాటకాన్ని ఎవరేనా వేస్తున్నారా యిప్పుడు?" గురజాడఅప్పారావుగారు కుతూహలంగాఅడిగారు.

"ఏ కన్యాశుల్కం అండీ? మొదటిదా రెండోదా?" చిలిపిగా అడిగాను.

"అక్కడ. నే బ్రతికున్న రోజుల్లోనూ ఆతర్వాత చాలా కాలం రెండో ముద్రణ కన్యాశుల్కాన్నే వేసేవారుగా! మళ్ళీ యివ్వాడేం వచ్చింది?" చిరాగ్గా అడిగారు గురజాడ.

"మీ మొదటి కన్యాశుల్కాన్ని మద్రాసు రికార్డు ఆఫీసు పుస్తకాల్లోంచి త్రవ్వితీసి, బండి గోపాలరెడ్డిగారు సవ్యాఖ్యానంగా ముద్రించారు. ఓ ప్రఖ్యాత వారపత్రిక దాన్ని సీరియల్‌గా ప్రచురించిందికూడాను. అందుకనే "మొదటిదా, రెండోధా?" అని అడిగాను" అన్నాను.

"అంతేకాదండోయ్! మీరే మొట్ట మొదటి ఆధునిక తెలుగు కథకులని కనిపెట్టి మీ కథల్నికూడా మళ్ళీ ప్రచురిస్తున్నారు. మీ 'దిద్దుబాటు' వగైరాలు మళ్ళి ప్రచారం పొందాయి! ఇది మళ్ళీ మీ యుగం!" బుచ్చిబాబు అన్నారు.

"ఏదో వెయ్యనీ! మొదటి కన్యాశుల్కం అంత బాగోలేదనే మార్చి రెండో కన్యాశుల్కం రాస్తే, మొదటిదానిసంగతి వీళ్ళ కెందుకయ్యా!" విసుగ్గా అన్నారు గురజాడ.

"ఎందుకేమిటండి? సాహిత్య పరిశోధన పి. హెచ్. డి; పట్టానికి పనికొస్తుంది. కందుకూరి వీరేశలింగంగారి జీవితం, సాహిత్యం గురించి వొకాయన పరిశోధించి డాక్టరేట్ తెచ్చుకున్నాడు. మీగురించీ ఎవరో వొకరు పరిశోధించి డాక్టరేట్ తెచ్చుకోవచ్చు" ఉత్సాహంగా అన్నాను.

"సరే! సరే! మీకు డాక్టరేట్ లేకపోయినా మీగురించి రాసినవాళ్ళకేనా వస్తుంది!" నండూరివారు అన్నారు.

"రామాయణంలో పిడకల వేట్లాటలాగ యీ గొడవకేం నా రెండో కన్యాశుల్కం వేస్తున్నారా? లేదా?" గురజాడ కోపంగా అడిగారు.

"ఎందుకో మీకంత ఆత్రం?" మధురవాణి కొంటెగాఅంది.

"వేస్తున్నారండి. రేడియోల్లో కూడా వినిపిస్తున్నారు. కాని తగ్గించి వేస్తున్నారు. సినిమా చూసినంత సేపు ముకంటే, జనం ఎక్కువసేపు నాటకం చూడలేకపోతున్నారు. అందుకనే తగ్గిస్తున్నారు" అన్నాను.

"చూడలేకపోతున్నారూ? ఇంతకంటే వీళ్ళుచేసి చచ్చే ఘన కార్యాలేమున్నాయి? చచ్చురాజకీయాలగురించిన కబుర్లేగా? మన వాళ్ళుటి వెధవాయలోయ్!" గురజాడ కోపంగా అన్నారు.

"అన్యాయం అప్పారావుగారూ! ఎంత వెధవాయలైనా యింకా మిమ్మల్ని మరచిపోకుండా మీ నాటకాన్ని వేస్తున్నారంటేనే సంతోషించాలి. పైగా మీరెండో కన్యాశుల్కంరాసి అరవై అయిదేళ్ళు దాటిందని మరచిపోతున్నారు!" బుచ్చిబాబు నవ్వుతూ అన్నారు.

గురజాడవారి మొహంలో వొక గర్వరేఖ తళుక్కుమని మెరిసి మాయమయింది!

"అవునవును! తెలుగు నవలని సినిమాతీస్తే అసలుకథ అందులో వుండదు! సినిమా మసాలావుంటుంది! అటువంటప్పుడు మీ నాటకాన్ని కొద్దోగొప్పో యధాతథంగా వేస్తున్నారంటే మన వాళ్ళని తప్పకుండా మెచ్చుకోవలసిందే!" మల్లాది వారు వత్తాసు పలికారు.

"అవునండి ఆమధ్య 'ఏకవీర' సినిమా గురించి విశ్వనాథ సత్యనారాయణగారు..." అంటూ నా సినిమా పరిజ్ఞానాన్ని వెళ్ళబోయ బోతున్నాను.

ఇంతట్లో బాలగంగాధరతిలక్, శశిమానస పియ వచ్చారక్కడికి

"ఏవయ్యా! ఇంకా కొంతకాలం అక్కడవుండి మమ్మల్ని గురించి రాస్తావని, జనం మమ్మల్ని మరచిపోకుండ చేస్తావని, మా

కవితా, కథా, శిల్పాన్ని వెల్లడిస్తానని, అనుకుంటే యిలా అర్ధాంతరంగా వచ్చేశానేమిటి?" తిలక్ నిష్ఠూరంగా అన్నారు.

నేనేమీ అనలేదు.

"మనదేశం సంగతులేమిటోయ్! చెప్పనేలేదు?" మల్లాది వారన్నారు.

"ఏవుందండి! గురజాడ అప్పారావుగారు "దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్" అన్నారు. ఇప్పుడు భారతదేశం నిండా మనుషులే! మట్టి తక్కువై పోతోందని ప్రభుత్వం గోల పెడుతోంది! తిలక్‌గారు యిక్కడికి వచ్చేముందోసారి "నలభైకోట్ల మనుష్యుల, నిజమైన ప్రాణవున్న మనుషులతో నిండిన దేశం నాది" అన్నారు. కాని నేను వచ్చేసరికే భారతజనాభా అరవైకోట్లు దాటిందట!" అన్నాను.

"అమ్మ బాబోయ్!" కోమలి భయంతో కళ్ళు పెద్దవి చేసింది.

"మన తెలుగువాళ్ళ కెవరికేనా నోబెల్ బహుమానం వచ్చిందా?" బుచ్చిబాబు అడిగారు.

"నోబెల్ బహుమానం రాలేదుకాని విశ్వనాథసత్యనారాయణ గారికి భారతీయ జ్ఞానపీఠం బహుమతి లక్షరూపాయలు వచ్చింది. అదే ఆంధ్ర సాహిత్యానికి యింతవరకూ లభించిన అత్యుత్తమ గౌరవం! నే వచ్చేటప్పటికి తమిళులకి రానేలేదు."

"విశ్వనాథకా?...శ్రీశ్రీకి, కృష్ణశాస్త్రికీ కాదూ?" తిలక్ మండిపడ్డారు.

"అవునయ్యా! సాక్షాత్తు విశ్వనాథకే! నువ్వు రాశావే 'మావాడే – మహా గట్టివాడు' అని ఆ విశ్వనాథకే!" బుచ్చిబాబు నవ్వారు.

"పోనీలెండి! ఎవరో ఒక తెలుగు వాడి కొచ్చింది. తమిళుల కంటే ముందొచ్చింది! అదీ సంతోషం" మల్లాదివారన్నారు.

"నోబెల్ బహుమానం రాదగిన స్థాయిలో తెలుగు రచనలున్నాయి కాని వాటికి బహుమతులు రావటంలేదు!" బుచ్చిబాబు విచారంగా అన్నారు.

"నోబెల్ బహుమానం రావాలంటే తెలుగు సాహిత్యంలోని అందచందాల్ని యథాతథంగా యింగ్లీషులోకి అనువదించి చూపగలిగే ప్రజ్ఞావంతులు కావాలి! అలా ఇంగ్లీషు, తెలుగు భాషల్లో నిష్ణాతులైన వాళ్ళెవరున్నారు మనకి? కాస్తో కూస్తో ఇంగ్లీషు రాగానే తెలుగుని యీసడిస్తారు! తెలుగు రానట్టు నటిస్తారు!" తిలక్ అన్నారు

"రవీంద్రుడు 'గీతాంజలి'ని బెంగాలీలోనూ, ఇంగ్లీషులోనూ తనే రాసుకున్నాడు అందంగా. 'చెమ్మీన్', మలయాళంలోనూ, ఇంగ్లీషులోనూ కూడా బాగుంది! మనవాళ్ళు ఇంగ్లీషులో స్వంతరచనలూ చెయ్యలేరు అనువాదాలూ చెయ్యలేరు! మళ్ళీ ప్రతివాడికీ యింగ్లీషు కావాలి!" మల్లాదివారు మండిపడ్డారు.

"నే చెప్పలేదూ" మనవాళ్ళుట్టి వెధవాయలోయ్!" అప్పారావుగారు అన్నారు.

"పోనీ హిందీలోకేనా అనువాదంచేస్తే కనీసం భారతదేశంలో మిగిలిన వాళ్ళకేనా తెలుగు సౌందర్యం తెలుస్తుంది." బుచ్చిబాబు అన్నారు.

'హిందీ అంటే గుర్తొచ్చింది. మీకో జోక్ చెప్పనాండి?" అన్నాను.

"చెప్పు, చెప్పు!" అన్నారంతా.

"ఒక అచ్చతెనుగువ్యక్తి హిందీలో రచనలుచేసి పేరు ప్రఖ్యాతులు, బహుమానాలు, సంపాదించుకున్నాడు ఆయన హిందీ రచనల్ని మరో తెలుగాయన తెలుగులోకీ అనువాదం చేశాడు!" అన్నాను

"ఇహ్హహ్హ! మన తెనుగువాడు తెనుగువాడే! ఇంకెవ్వరూ వీళ్ళని అనుకరించలేరు" బుచ్చిబాబు నవ్వారు

"ఎలా అనుకరిస్తారు? వీళ్ళే అందర్నీ అనుకరిస్తారుగ!" తిలక్ అన్నారు

అంతా ఘొల్లుమని నవ్వారు!

"అవునురా అబ్బీ నీ గురించి కాస్త చెప్పు, వింటాను!" మల్లాది వారన్నారు.

రాకేందు వదనకూడా అభ్యర్థిస్తున్నట్టు చూసింది.

"నా గురించి మీలాంటి ప్రతిభావంతులముందర చెప్పుకోవడానికి సిగ్గేస్తోంది!" అన్నాను.

"మరీ సిగ్గభినయించకురా అబ్బీ! నీ సంగతులు మాకు కర్ణాకర్ణిగా తెలుస్తూనే వున్నాయి. అమన్వ నాగేశ్వరరావు పంతులుగారూ, శంభూ ప్రసాద్‌గారూ కనిపించినప్పుడు నువ్వు వాళ్ళ పత్రికలో రాస్తున్నావని, ఆమధ్య మా అందరి గురించీ కలిపి రాశావని చెప్పారు!" మల్లాదివారు చనువుగా మందలించారు.

"అరె! వారూ యిక్కడే వున్నారా?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఊఁ! ఇక్కడే! కాని వాళ్ళది పత్రికా సంపాదకుల కాలనీ!

ఆ మూలగా వుంది! అప్పుడప్పుడు కనిపించి, మాతో పిచ్చాపాటీ మాట్లాడి వెడుతూ వుంటారు కిందనుంచి యెవరొచ్చినా ప్రతి కల గురించి భోగట్టా సేకరిస్తూ వుంటారు'' బుచ్చిబాబు అన్నారు

ఇంతట్లో వొక బ్రాహ్మణుడు వో చేతిలో తాటాకుల గ్రంథం, మరో చేతిలో బంగారుపిడివున్న ఘంటం ధరించి పైనుంచి వేగంగా దిగివచ్చి హడావుడిగా వెళ్ళిపోతున్నారు.

మల్లాదివారు ఆయనకు ఎదురు వెళ్ళి సాష్టాంగ నమస్కారం చేసి 'నమస్కారం నన్నయ్యభట్ట పాదులకు! ఎక్కడికో హడావుడిగా వెడుతున్నారు'' అని పలకరించారు.

ఆయన ''చిరంజీవ'' అని దీవించి ''మా రాజమహేంద్ర వరంలో నా జయంతిసభ జరుపుతున్నారట! ఓసారి వెళ్ళి మా వూరు చూసి రావాలి!'' అని హడావుడిగా వెళ్ళిపోయారు.

ఆయన వెనకాలే అలాగేవుండి మరింత రాజఠీవి తొణికిస లాడుతున్న మరొకాయన హడావుడిగా వెడుతున్నారు.

''తిక్కన సోమయాజులవారికి నా అభివాదం'' అంటూ ఎదురు వెళ్ళారు మల్లాది రామకృష్ణశాస్త్రిగారు.

''దీర్ఘాయుష్మాన్‌భవ!'' అని దీవించారాయన. హైదరాబాదులో యువభారతివాళ్ళు నా కవిత్వం గురించి ఒక సాహిత్య ఉపన్యాసం యేర్పాటు చేసారట. టైమయిపోతోంది. వెళ్ళొస్తా!'' హడావుడిగా ఆయనా వెళ్ళిపోయారు.

''వీళ్ళకి ఇక్కడికి వచ్చినా వాళ్ళ కవిత్వమంటే ఎంత అభిమానమో! ఎక్కడేనా తమ పేరు తలుచుకుంటే చాలు గబుక్కున అక్కడకు పరిగెడతారు!'' గురజాడ అన్నారు.

''అవునండీ! ఇక్కడకు వచ్చేసినా ఇంకా మిమ్మల్ని ''చిరంజీవ'' ''దీర్ఘాయుష్మాన్ భవ'' అని దీవిస్తారేమిటి?'' బుచ్చిబాబు నవ్వారు!

''అలవాటు! సంప్రదాయ వాదులుకదా!'' మల్లాదివారు నవ్వారు. ''అదికాదు! మీ పేరు తెలుగు నేలమీద చిరంజీవిగా, దీర్ఘాయుష్మంతురాలిగా వుండాలని!'' కోమలి నవ్వుతూ అంది.

''హౌరా! నువ్విక్కడికొచ్చి ఎంత తెలుగుమీరిపోయావ్!'' బుచ్చిబాబు నవ్వారు.

''అంచెయ్యను! మీ సహవాసదోషం! ''కోమలి కొంటెగా కన్ను మెదుపుతూ అంది.

''అయ్!'' అంటూ బుచ్చిబాబు ఆమెని కొట్టబోయారు. కోమలి ఆయన కందకుండా పరిగెడుతోంది.

''విడిపోయిన నెం డుకలు వెంపని పరదాలో కప్పివేశాయి. అంచులేని పల్చటి ఆకు పచ్చచీర గాలికి రెండుకాళ్ళనీ పట్టుకుని వెనక్కి గోచీకోసం ఎగురుతోంది కుడిచేతికి వొక్కటే ఆకుపచ్చ గాజు. అక్కడక్కడ రాళ్ళులేని దుద్దులు. ఎర్రగళ్ళ నల్లరవిక''...

''గడ్డిపోచలే ప్రాణం పుచ్చుకుని ఎదిగిపోయి, మనిషిగా మారి నట్లు పచ్చచీరలో కోమలి కదిలిపోతోంది. ఆకుపచ్చగా పల్చబడి అంతర్ధానమైపోయింది''.

''అట్లా గడ్డిపోచల మధ్య గంతులేస్తూ ఆకాశాన్నీ, భూమినీ బుజ్జగిస్తూ స్నేహంచేసుకుంటూ వుండవలసిన వ్యక్తి కోమలి! ఆమె నిజస్థానం అది! పుట్టిల్లు పచ్చగడ్డి. అత్తిల్లు ఆకాశం. పిట్టలు పువ్వులు సంతానం!''

అంతా ఆదృశ్యాన్ని తన్మయత్వంతో చూస్తున్నారు. ఇంతలో కందుకూరి వీరేశలింగంగారిలా వున్న వొకవ్యక్తి గబగబా పైనుంచి క్రిందకి దిగివచ్చి మాముందుగా వెడుతున్నారు.

''ఏమిటండోయ్ వీరేశలింగంగారూ! హడావుడి పడుతున్నారు! కారణం యేమిటి?'' గురజాడవారు ఆయన్ని ఆపి ప్రశ్నించారు.

''ఆంధ్రదేశంలో వో వితంతు వివాహం జరుగుతోంది! నే వెళ్ళి ఆ దంపతులను ఆశీర్వదించిరావాలి! హడావుడిగా వెళ్ళారాయన.

''ఓహో! విడో-రేజా?'' గురజాడ తల పంకించారు.

''విడోమారేజి సివిలేజషన్‌కు నిగ్గు!'' మధురవాణి ఆయన్ని కవ్వించింది!

ఆయనేదో అనబోతున్నారు. బుచ్చిబాబుగారు, కోమలి తిరిగి వచ్చారు ఇంతట్లో నల్లకోటు, ప్లీడరు తలపాగా, పంచెకట్టుతో వొకాయన విసురుగా వచ్చారక్కడికి.

''రావొద్దె నాపక్క రావొద్దె యెంకీ,
ఆ పొద్దు మన పొత్తులయి పోయెనెంకీ,
నీమీగ ప్రాణాలు నిలుపుకుంటూవచ్చి
అర్ధరేతిర్లోన అడవంత తిరిగానె,
గట్టెక్కి సూశాను, పుట్టెక్కి సూశానె
కల్లకపటములేని పిల్లననుకున్నానె'' అన్నారు.

ఆయన వెనకాల వొకావిడ మెల్లిగా వస్తోంది ''పచ్చని పేలోన, పండు యెన్నెల్లోన నీలిసీరాగట్టి నీటుగొస్తావుంటె' అని బుచ్చిబాబుగారు మెల్లిగా పాడుతున్నారు.

ఆయన ''యెంకీ'' 'యెంకీ'' అంటున్నాడు. బుచ్చిబాబు గారూ యెంకిపాటలా కూనిరాగం తీస్తున్నారు కొంపదీసి ఆయన నండూరి సుబ్బారావుగారు, యీవిడ యెంకి కాదుగదా అనుకున్నాను.

దగ్గరకొచ్చేంతావిడ "మెళ్ళో పూసలపేరు తల్లో పూవుల పేరు సెక్కేట సిన్నిమవ్వ అంపలె. బొమ్మల్లె అందాల బరిణల్లె, సుక్కలె ..అందాల నాయెంకి" బుచ్చిబాబుగారు కొంటెగా పాడుతున్నారు, తగ్గుస్వరంలో.

కోమలి ఆయనవైపు కోపంగా చూసింది.

ఆవిడ ఆయనవైపు జాలిగా చూసి "ఈరేయి నన్నొల్ల నేరవా రాజా. యెన్నెలల సాగసంత యేటి పాలేనటరా" అంటోంది

మళ్ళీ, చుట్టూ అందర్నీ చూసి సిగ్గుపడి "సాటునుండే యెంకి సబకు రాజేశావ. పదిమంది నోళ్ళలో పడునుంట రాశావ" అని తలదించుకుంది.

నండూరి సుబ్బారావుగారు యెంకీను సందేహం లేదు అని నిశ్చయించుకున్నా నావైపుచూసి. సుబ్బారావుగారు "ఏవయ్యా తెలుగు వాడిలాగేవున్నావు? ఎవరునువ్వు? మా పశ్చిమగోదావరి వాడవేనా?" అని అడిగారు.

"పుట్టింగక్కడేనండి! పెరిగింది తూర్పుగోదావరిలో చివరవున్నది నల్లగొండ జిలా లోని నాగార్జునసాగర్ లో" జవాబిచ్చాను నేను.

"ఎక్కడుంటేనేం ఎక్కడ పెరిగితేనేం! పుట్టింది పశ్చిమ గోదావరేగా! నువ్వు ప. గో. జి. వే.!" నవ్వారాయన.

ఈలోపల తమలో తామేదో మాట్లాడుకుంటున్న బుచ్చిబాబుగారు, కోమలి మావైపు తిరిగారు.

"ఏమిటి, "పశ్చిమగోదావరి' అంటున్నారు!" అన్నారాయన.

"అబ్బే! ఈయనా, మన పశ్చిమగోదావరివాడేనా అని మన సుబ్బారావుగారు అడుగుతున్నారు!" అని తిలక్ నావైపు చూపించారు.

"అయితే నేనూ, మల్లాది శాస్త్రిగారూ. పైజిల్లాల వాళ్ళమా? మా కళింగ రాజ్యం వాళ్ళెవరూ యిక్కడ లేరా? అవసరాల సూర్యారావేనా లేడా?" గురజాడ తీవంగా అన్నారు.

"పశ్చిమ గోదావరి సొకప్పుడు మా కృష్ణాజిల్లాలో వుంది. అలాగే మీ విశాఖజిల్లా రాజమండ్రీవరకూ 'త్రికళింగ' గా వుంది! కనక మనకా విబేధం యేమీలేదు!" మల్లాది రామకృష్ణశాస్త్రిగారు నవ్వేస్తూ అన్నారు.

"ఏజిల్లా అయితేనేం! అంతా తెలుగువాళ్ళం! అది చాలదూ మనకి?" కోమలి నవ్వుతూ అంది. అంతే నన్నటు, మధురవాణి రాకేందువదన, శశిమానసప్రియ తలలూపారు

"మరేపాపం! ఊరు విజయనగరం! పేరు మధురవాణి!" బుచ్చిబాబు కొంటెగా అన్నారు!

అంతా నవ్వారు!

"మీరేం అనండి కాని, ఆ కాలువలు, ఆ తోటలు. ఆవేళ పశ్చిమగోదావరి అందం వర్ణనాతీతం!" బుచ్చిబాబు 'రివరీ లో పడ్డారు.

"అవునవును! ఆ యేరు, ఆతోట!" ఏటి కడుపువదాగి తోట నిదరోయింది" సుబ్బారావుగారు ఆకాశంకేసి చూసి తనలో తను మెల్లిగా అనుకున్నారు.

తిలక్‌కూడా "అరటితోట నడుంచుట్టి కాలువ ఏటవాలుగా మలుపుతిరిగింది. నారికేళ వనాంతాన ప్లాటినం సంకేతంలా మెరుపు మెరిపింది" అని మెల్లిగా పాడుకుంటున్నారు.

"హు! మా కళింగ రాజ్యంసంగతి, మా బొంకుల దిబ్బ సందడి, అయ్య కోనేటి సౌందర్యం, మోతీమహలు వైభోగం కేం తెలుసు!" గురజాడ విసుక్కొన్నారు.

"మరి మా కృష్ణాతీరం సంగతి, మా బందరు మజాయో!" మల్లాది వారు నవ్వుతున్నారు.

"మీకీ జిల్లాల, ప్రాంతాల. బేధాలుకాని మాకేంలేవు! కాదు మధురం? కాదే రాకేందువదనా?" అంటూ వాళ్ళని అడిగింది కోమలి.

"మాకూలేవు! కాదు యెంకీ?" బుద్ధిమంతురాలిలా అంది శశిమానసప్రియ. అవునన్నట్టు తలూపింది యెంకి!

అంతా నవ్వేశారు.

"ఒరేయ్ అబ్బీ! నీ సంగతులు చెప్పకుండా ఎగ్గొట్టేస్తున్నావు! అక్కడవున్నవాళ్ళు నిన్నెవళ్ళైనా యింటర్వ్యూ చేస్తే బాగుండునని మహ యిదయ్యావుకదా! ఇప్పుడు ఛాన్సొస్తే వుపయోగించుకోవేం?" నవ్వారు మల్లాదివారు.

నా మనసులో సంగతి ఆయనకెలా తెలిసిందా అని ఆశ్చర్యం కలిగినా అంతా నా వైపు చూస్తుంటే సిగ్గుతో తల దించుకున్నాను.

"అక్కడ తీరని కోరికల్ని యిక్కడ తీర్చుకోవచ్చు నిరభ్యంతరంగా. ఊ! కానీ!" బుచ్చిబాబు ప్రోత్సహించారు.

"అసలు రాయాలని, పుట్టి బుద్దెరిగిన పాతికేళ్ళదాకా అనుకోలేదండి మీ అందరి రచనలూ చదివి ఆనందిస్తూ వుండేవాడిని. ఆ తర్వాత ఏదో కొద్దిగా రాయడం మొదలెట్టాను. ఓ చిన్న సీరియలూ, ఏవో కొన్ని కథలూ రాసాను. ఇంకా ఏదీ చెప్పుకో దగ్గది రాయనేలేదు! ఇంతలో హటాత్తుగా..." నా కంఠం గద్గదమైంది.

"బాధపడకు! రాసిందే చాలులే! తెలుగు భాష గురించి, తెలుగు రచయితల్ని గురించి నీలో వున్న అభిమానం, అందరిలో అది పెంపొందాలనే తపన, నీ తర్వాతి వాళ్ళలో ప్రతిఫలించకపోవు." ఓదార్పుగా అన్నారు మల్లాదివారు.

"నువ్వేదో 'చైతన్య స్రవంతి'లో కొన్ని కథలు రాసావుటగా? నువ్వింకా పరిణతి పొందలేదని, నేను రాసింది సర్కస్ ఫీటు అని వో వారపత్రిక పాఠకుడు రాశాడటగా! ఫరవాలేదు! ఆమాత్రం జ్ఞాపకం ఉండేలా రాయడం చాలదా?" బుచ్చిబాబుగారు కూడా ఓదార్చారు.

"అవునుగాని, తెలుగు కథా, నవలా రచయితల్ని, సభల్లో గౌరవించి సన్మానాలు చేస్తున్నారా, మేము వున్నప్పటిలాగానే వుందా పరిస్థితి?" బుచ్చిబాబు విషయం మార్చారు.

"ఇప్పుడు కాస్త నయమేలెండి! రచయిత్రుల ధర్మమా అని యిప్పుడు నవలా రచయిత్రులకి, కథా రచయిత్రులకి సభలలో సన్మానాలూ, అంకితాలూ జరుగుతున్నాయి. అయినా కవులలాగ యీ కథకులు, నవలా రచయితలు, తమ రచనల్లోంచి చిన్న భాగాలు తీసి చదివి వినిపించి సభను రంజింప చెయ్యలేరుగా!" నవ్వాను.

"అవునవును! అసలెలా అయినా తెలుగు కవులు అదృష్టవంతులు. రాసింది కాస్త అయినా, పదిసార్లు పదిరకాలుగా చదివి, ఆ అరపేజీ కవిత్వంతోటే సభల్లో సన్మానాలు కొట్టేస్తారు. సభల నదరకొట్టటమేకాక ఏదోవొక అకాడమీ బహుమానం కూడా కొట్టేస్తారు" బుచ్చిబాబు నవ్వుతూ అన్నారు.

"అందుకే యీ గురజాడవారూ, మల్లాదివారూ, తిలక్కూ, ఎందుకేనా మంచిదిలే అని కథలూ, కవిత్వాలూ కూడా రాశారు!" నండూరి సుబ్బారావుగారు నవ్వుతూ అన్నారు.

"నువ్వు అజ్ఞానం అనే వచన కావ్యం రాసి కవిత్వం వెలిగించావు కాదయ్యా! కవివి కాలేకపోయినా, కథల్లో కవిత్వధోరణి కురిపించలేదూ?" గురజాడ నవ్వుతూ అడిగారు.

"కవి కాలేనివాడి కథలవి!" నవ్వారు బుచ్చిబాబు.

"ఏరా అబ్బీ! నువ్వు రెండూ వెలిగించినట్టున్నావుగా?" మల్లాదివారు చనువుగా అన్నారు.

"ఏదో కొంత వచన కవిత్వం రాసాను, కాని అచ్చవలేదండి" నసిగాను.

"రాసావుకదా! అది చాలు!" నండూరి సుబ్బారావుగారు లాపాయింటు లాగారు.


ఆంధ్రుల అభిమాన దిన పత్రిక

# ఆంధ్రపత్రిక

ఇప్పుడు ఎన్నో సరికొత్త శీర్షికలతో వెలువడుతోంది.

విడి ప్రతి వెల 30 పైసలు

......................... చందా వివరాలు .........................

| | | | | |
|---|---|---|---|---|
| సంవత్సరమునకు | ఏజెంటు ద్వారా | రు. 108-00 | పోస్టుద్వారా | రు 115-20 |
| ఆరు మాసములకు | ,, | రు. 54-00 | ,, | రు. 57-60 |
| 3 మాసములకు | ,, | రు. 27-00 | ,, | రు. 28-80 |
| 1 మాసమునకు | ,, | రు. 9-00 | ,, | రు 9-60 |

"అవునోయ్ బుచ్చిబాబూ! నువ్వు నీ చివరికి మిగిలేది ముందుమాటలో 'ఈ జీవిత రహస్యం దాన్ని తెలుసుకోడానికి మానవుడు చేసేయత్నం—ఏ గొప్ప గ్రంధానికైనా యివి పునాది. ఈ నవలకి అదే పునాది!" అన్నావుట! అంటే నీ పుస్తకం కూడా గొప్ప గ్రంధం సుమా! అని చెప్పటమేగా?" గురజాడ నవ్వుతూ అడిగారు!

బుచ్చిబాబు చిన్నగా నవ్వి వూరుకొన్నారు

"బ్రతకనేర్చినవాడు!" నండూరి నవ్వారు.

"బ్రతక నేరిస్తే యింత తొందరగా యిక్కడి కెందుకు వచ్చేశాడు?" తిలక్ అన్నారు.

"అన్నట్లు గురజాడ అప్పారావుగారు వారి కన్యాశుల్కాన్ని రెండో ముద్రణలో పెంచిరాస్తే, బుచ్చిబాబుగారు తమ చివరకు మిగిలేదిని రెండో ముద్రణలో తగ్గించి అచ్చేసారు."

"అవును! నిజమే!" తిలక్ బుర్ర వూపారు.

"అంతేకాదండోయ్! బుచ్చిబాబుగారికి, గురజాడ వారికి, నండూరి వారికి వీళ్ళందరి పేర్లలోను 'వెంకట' వుంది. దాన్ని వదిలేసుకుని వారు ప్రఖ్యాతులయ్యారు. అలాగే చలంగారికీ, కృష్ణశాస్త్రిగారికి, కూడా 'వెంకట'వుంది. నాకూ, మా అమ్మా, నాన్నా, నా పేరులో వో 'వెంకట' పెడితే నేనూ తొందరగా పైకివచ్చి వుండేవాణ్ణి!" నవ్వుతూ అన్నాను.

"ఏమె తేనేం! ఇప్పుడూ తొందరగానే పైకి "వచ్చావుగా!" మల్లాదివారు నవ్వారు.

నేనూ నవ్వేశాను.

"అంతే కాదండోయ్! ఈ ముగ్గురికీ యింకా పోలికలున్నాయి! బుచ్చిబాబుగారు లెక్చరర్‌గా పనిచేశారు. గురజాడవారు లెక్చరరుగా చేశారు. నండూరి సుబ్బారావుగారుకూడా కొన్నాళ్ళు టీచరుగా చేశారు! ఇవికూడా వీళ్ళ ప్రఖ్యాతికి కారణ భూతాలని నానమ్మకం!" అన్నాను "ఆ భూతాలుకాదు మా ప్రఖ్యాతికి కారణం. ఈభూతాలు" అని నవ్వుతూ గురజాడ అప్పారావుగారు, మధురవాణి, కోమలి, యెంకి, ల వైపు చూపారు.

"పంతులుగారూ! మరీ అన్యాయంగా మాట్లాడుతున్నారు." అంది మధురవాణి కోపాన్నభినయిస్తూ.

"ఉన్నమాటేకదా మధురం!" మల్లాదివారు నవ్వారు!

"మామా! మీరు మధురం, గిధురం అనకూడదు" గురజాడవారు చిరాకు పడ్డారు.

అంతా ఘొల్లున నవ్వారు.

"ఒరేయ్ అబ్బీ! నాకూ రాకేందువదనకీ లంకె పెట్టావు. శశి మానస ప్రియుకీ తిలక్‌కీ 'బాధాగళం' కవితనిబట్టి కలిపావు. నండూరివారికీ, యెంకికి సంబంధం వుందని చలంగారు సరదాగా అన్నారని విన్నాం. "పాత్రలు వేరు వ్యక్తి వేరు అన్న వాదానికి దూరులు. ప్రేమ స్వరూప స్వభావాలు సాక్షాత్కరించుకొన్నవారని" తిరుమల రామచంద్ర బుచ్చిబాబు గురించి రాశారని తెలిసింది. కనుక కోమలికీ ఆయనకీ లంకె బెట్టినా వూరుకొన్నాను. ఇవన్నీ సరేకాని మీకాలంవారెరుగని గురజాడ వారికీ, మధురవాణికీ ఎలా సంబంధం కలిపావు?" మల్లాదివారు నవ్వారు

"గురజాడ వారే నా మధురవాణిని చూచి నేనే భ్రమసి పోతున్నాను, అని వో చోట రాసారుట. - పైగా కొడవటిగంటి కుటుంబరావుగారు వీరి మొట మొదటి కన్యాశుల్కం గురించి సమీక్షిస్తూ ఆనంద గజపతిగారి మరణానంతరం గురజాడ కన్యాశుల్కాన్ని తిరిగి రాయడానికి, మధురవాణి పాత్రని పెంచడానికి కారణం వుందేమో పరిశీలించాలి అని రాశారు! అది చాలదా మాకు" నవ్వాను

"మీ తెలుగు వాళ్ళు అసాధ్యులు! బుంగ మూతి పెట్టింది మధురవాణి.

"నువ్వు ఆకతాయిలో దానివేగా మధురం!" మల్లాది వారన్నారు.

"అదుగో మామా! మళ్ళీ!..." చిరాకు పడ్డారు గురజాడ!

ఇంతలోనే హటాత్తుగా వొకాయన అక్కడకు పరుగెత్తుకుంటూ వచ్చాడు. మల్లాది వారిని చూసి "కవిరాయా నీ కవనం పవనమైనది. పవనాని కొచ్చిన చిరునవ్వే వనమాలైనది. కదలి వచ్చిన ఘనసార కళిక సామేని వానికి,అరతయ్యేను. జవకా రమ్మన్నది" అన్నాడు.

"అలాగా" అంటూ ఆయన హడావుడిగా కదిలారు. ఆయన కూడా రాకేందు వదన బయలుదేరింది. దూరంగా "శంభోమహాదేవ" అన్ననాదం వినిపించింది.

"అవునయ్యా నీ సుమిత్రా, యశోధరా, నీతో ఎవరూ రాలేదేం?" బుచ్చిబాబు అడిగారు.

తెల్లబోయి ఆయన వైపు చూసాను.

"అదేనయ్యా! నీ కథానాయికలు! నువ్వు మమ్మల్నందర్నీ తలొకరితో కలిపావు. మరి నీ సంగతేమిటి?" బుచ్చిబాబు నిలదీశారు.

"అప్పే ఏం లేదండి! ఒట్టి వూహాలేనండి!" నపిగాను.

"మావె తే గట్టివి. మీవె తే వుట్టివీనా? ఏంచోద్యం!" మధురవాణి ముక్కున వ్రేలేసుకుంది!

నవ్వేసి వూరుకొన్నాను.

"మేం వచ్చేశాక రచయితల పరిస్థితి యెలా వుందక్కడ" తిలక్ అడిగారు.

చాలా ఘోరంగా వుందండి! ఆడ పేరు వుంటేనే కాని సీరియల్సు అచ్చవ వక్కడ! ఆ సీరియల్సు వుంటేనే కాని పత్రికల సేల్సుండవు! పత్రికల్లో పేరుంటేనే కాని పుస్తకాలు అచ్చవవు. ఇది మహిళా దశాబ్దం అని ప్రపంచ మంతటా ఇప్పుడు జరుపుతున్నారు కాని ఆంధ్ర సాహిత్యంలో మహిళా దశాబ్దం ప్రవేశించి చాలా రోజులైంది! సినిమాల కోసం రచనలు. సినిమాలు చూసి రచనలు! అబ్బ! మహా గందరగోళంగా వుందండి" అన్నాను.

"ఆ మధ్యన నువ్వు రాశావుగా" నవలలు నవలలు రాసేస్తున్నారు. కవలలు క్యాండూపెట్‌లు సృష్టిస్తున్నారు. (నవలల్లో)... ఇది కలికాలం" అని అక్షరాలా అదే కాలం అన్నమాట! బుచ్చిబాబు తిలక్ వైపు చూసి నవ్వారు.

"మరీ అన్యాయంగా మాట్లాడుతున్నారు. రచయిత్రులంటే మీకు ఐరావతాల్లా కనిపిస్తోంది; మీ మగపేరుతోనే మీ సీరియలూ, కథలూ అచ్చేశారు కదా! ఇంక ఆడవాళ్ళని ఆడిపోసుకోవడమెందుకు?" మధురవాణి నిలదీసింది నన్ను!

"క్రాసెగ్జామినేషను చేస్తోందోయ్. దీంతస్సాగొయ్యా!" గురజాడ నవ్వుతూ మెల్లిగా అన్నారు.

"అవసరమైనప్పుడు చెయ్యకతప్పుతుందా ? మీ పురుష బుద్ధే అంత! మీరు మాత్రం యేం జేశారు. గిరీశంచేత, కరటక శాస్త్రుల్లుచేత, సౌజన్యారావు పంతులుచేత, మధురవాణి అందమే మనుషుల్ని పాడుచేస్తోంది అనిపించలేదూ?" దూకుడుగా అంది కోమలి.

శభాష్ అన్నట్టుగా మధురవాణి, శశిమానస ప్రియా, కోమలి వైపు చూసారు!

"తప్పు కోమలీ! ఆయన పెద్దవారు! ఏదో హాస్యానికంటే"... బుచ్చిబాబు ఆమెకి సర్ది చెప్పబోయారు.

"శంభో మహాదేవ" అంటూ ఈలోపల మల్లాదివారు కూడా శాకేందుపడనా తిరిగివచ్చారు. ఆయనకళ్ళు ఆర్ద్రంగా వున్నాయి.

"ఏమయిందండి !" ఆత్రతతో అడిగాను.

'మేం వెళ్ళినదాక అంతా చీకటిగా వుంది!" తోవ పొడుగునా మొక్కా, మోడూ రెక్క కదల్చకుండా మౌనిరు కని పెడుతున్నాయి. ఉన్నవీ లేనివీ మోతలు ఎక్కడెక్కడో ఏమేంనో అలో నెరెడుగా మార్మోగుతున్నవి నిశ్శబ్దంలో.

"వెన్నెల మరింత వెలుగులో వున్నది అందులో రవ్వంత మేర వీ రసు చీకటి, అందులో ఆ చిన్న హిమనగశృంగంవలె వున్నది. బాల భగము లామెకు సొమ్ములు పైన మిణుగురులు వెలుగుపట్టినవి ఆ చెంపా, యీచెంపా పడగలు లిచ్చి కోడె తాచులు ఆ మూర్తికి వీవన జేస్తున్నవి."

నేవెళ్ళగానే "నాగములు కంకణబంధములిచ్చి బరాబరులుగా బుసలు కొట్టినవి...ఘనసారకళిక పజ్వలించింది. స్వామివారి ఆలయములో వేయిమెరుపులు మెరిసినట్లు, ముమ్మారు తళుకు కమ్మినది" "ఆమె దేవునిలో ఐక్యమైనది." అన్నారు ఆయన. శాలువాతో కన్ను లొత్తుకున్నారు.

"పాపం ! ఆయన మానసపు తిక !' బుచ్చిబాబు మెల్లిగా అన్నారు

"ఎక్కడవుందండి ఆ ఆలయం ?" నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అడిగేను.

"దూరపుకొండల్లో వెహనలనికాని దూరాన కోనవుంది. దారీ తెన్నూలేని ఆకోనలో అకాశాన్ని రాపాడే మానుల నీడల్లో-ఎండ కన్నెరుగకుండా ఉంది" అన్నారాయన దూరంగా చూస్తూ.

చుట్టూ వాతావరణం గంభీరంగావుంది. ఎవ్వరూ ఏమీ మాట్లాడటంలేదు వాతావరణాన్ని తేలికపరచడానికా అన్నట్టు బుచ్చిబాబుగారు. నండూరిసుబ్బారావుగారితో "సుబ్బారావుగారూ, మీరు "ఆరిపేరువెదీపమూ. యెలుగులో నీమీద నిలపలేనే మనసు" అని యెంకితో అన్నారుగదా ! యెంకి భూమిమీద ఉండేటప్పుడు అంత భరించలేనంత. వల్లగావుండేదా ?" అని నవ్వారు.

అంతా ఘొల్లుమని నవ్వారు.

సుబ్బారావుగారు గుబురుమిసాలచాటునుంచి ముసిముసిగా నవ్వుతూ యెంకివైపుచూసి "ఆమెనే అడగండి" అన్నారు.

అంతా మరోసారి నవ్వారు,

"ఇంతకీ అసలు భూమిమీద ఎంకి ఎవరండీ ? కుతూహలం అపుకోలేక అడిగానాయన్ని.

"అక్కడవున్నన్నాళ్ళూ చలంగారూ మిగిలిన మి తులూ రకరకాలుగా ప్రశ్నించి నాప్రాణం తీసారు? మళ్ళీ యిక్కడా నువ్వు యీ

రయ్యా వా? ఏంకెవ్వరని లోకమెపుడైన కదిపితే. వెలుగునీడలవైపు వేలు చూపిస్తు." అంటూ నవ్వారాయన.

"పోనీ మీకి యేవూళ్ళో వుండేది? అదేనా చెప్పండి" అన్నాను.

"యేడ నీకాపురమో యెల్తురుపిల్లా ?" అని యెంకివైపు కొంటెగా చూశారు సుబ్బారావుగారు.

"ఆయన ప్రసిద్ధ లాయరు! నువ్వాయన్ని మాటలో. పట్టుకోగలవా?" బుచ్చిబాబు నవ్వారు.

"మీరు అభ్యుదయవాది అని కొందరూ, ఏదారీ నిర్ణయించుకోలేనివాడని కొందరూ వాదించుకుంటున్నారు! మీరేమంటారు" తిలక్‌గారిని అడిగాను.

"నాకు మీ సాహిత్య వివాదాలు తెలియవు, నలుగురికీ మంచి చేసుకోవడం అంతకన్నా తెలియదు!" తిలక్ అన్నారు.

"అవునవును! మీకు తెలిసిందొకటే!" కొంచెంసేపు స్వప్నంలోకి గోర్వంకల రెక్కలతో ఎగిరిపోదామన్న తరచి, కలయేన్నడూ మనిషికి బలం! మిథ్యా జీవనరధ్యలలో స్వప్నంపొకసుందరతను మత్య..!..." వెక్కిరించింది శశిమానవప్రియ కొంటెగా

బుచ్చిబాబుగారూ! మీరు 'ప్రతిరచయితా తను వ్రాసే కథాకళ పద్ధతిపట్ల అభిరుచికూడా పాఠకులలో తనే సృష్టించుకోవాలేమో' అన్నారు! కాని నా కథలపట్ల ముందు సంపాదకుల అభిరుచి సంపాదించడమే కష్టమయింది నాకు!"

నవ్వాను నేను.

"ఎవరూ ఎవరికీ పూర్తిగా అర్థమవరు! అర్థం అవకపోవడంలో నొకవైచిత్రివుంది!' బుచ్చిబాబుగారు గంభీరంగా అన్నారు

'అదిసరేకాని, మీరు మరోచోట కుటుంబరావుది తెలివైనవాడి అమాయకత్వం" అన్నారు ఇందులో కొంచెం విరసాభాసలేదూ? తెలివైనవాడికి అమాయకత్వమేమిటండీ?" నవ్వుతూ అడిగాను బుచ్చిబాబుగారిని.

"ఆయనకు హృదయమేనయ్యా బాబు! అందుకనే భూమి మీద ఏదీ సంపాదించి నిలవెయ్య లేకపోయాడు!" తిలక్ నవ్వారు.

"మీ కథల్ని ప్రతి దీపావళికీ ప్రచురించి పేరు తెచ్చుకున్నవో ప్రఖ్యాత పత్రిక మీ మరణానంతరం విచారం కూడా ప్రకటించక పోవడం, మాకు బాధ కలిగింది" అన్నాను, బుచ్చిబాబుగారితో.

రచయిత ప్రసిద్ధిలో వుండీ; బతికివుంటేనే పత్రికలకు ఉపయోగం! చనిపోయిన వాళ్ళు వాటి సర్క్యులేషన్ పెంచలేరుగా! అందుకని మానేసి వుంటారు! నవ్వారాయన,

"ఒరేయ్ అబ్బీ! చూడబోతే యిది బుచ్చిబాబుతో ఇంటర్వ్యూలా వుంది! నువ్వు కొంపదీసి ఏ పత్రిక తరఫునా ఇక్కడకు రాలేదు కదా? మల్లాది శాస్త్రిగారు నవ్వారు.

"అబ్బే! అయివుండదు! ఇంటర్వ్యూలు చెయ్యటం, చెయ్యబడటం ఇట్లాంటి తీరని కోరికల్ని ఇక్కడ తీర్చుకుంటున్నాడు!" నండూరి సుబ్బారావుగారు నవ్వారు.

"బుచ్చిబాబుగారు శుద్ధ అమాయకులండీ! ఎంతో గొప్ప పేరు తెచ్చుకుని కూడా ఒక్క నవల తప్పితే మరో నవల రాయలేదు! ఆ ఒక్క నవలనీ కూడా రెండోసారి తగ్గించి మరీ అచ్చేసుకున్నారు. ఇప్పటి రచయితలలా కాదు. చిన్న కథని సాగదీసి వందల కొద్దీ పేజీలు రాసిపారేస్తున్నారు. ఏ ప్రఖ్యాత రచయితకీ పాతిక నవలకి తక్కువ లేవు! మరీ ప్రఖ్యాతులైన వాళ్ళు ఒకేసారి పది సీరియల్సు కంటే తక్కువ రాయటంలేదు! మల్లాది వారు రెండు నవలల కంటే ఎక్కువ రాయలేదు!. ఇంక తిలక్‌గారసలు రాయనే లేదు" అన్నాను

"అందుకే బుచ్చిబాబును తెలివైన అమాయకుడన్నాను!" అన్నారు తిలక్.

అంతా ఘొల్లుమని నవ్వారు.

"ఇంకా నయం! రచయితలు, విమర్శలు, కవిత్వం వీటి జోలికి వచ్చినట్లు లేదు! లేకపోతే తిలక్ రాసినట్లుగా" వచనం వదలిన మగవాళ్ళు నిర్వచనంలేని, కవితా కంటకవనాంతరాల" నుండి కూడా ప్రవాసులై నిర్వాసులై పోయేవారు" నవ్వారు మల్లాదివారు.

"అన్నట్టు బుచ్చిబాబుగారూ, మీరు కథలు రాసే రోజుల్లో ఒకాయన మిమ్మల్నుద్దేశించి, ఈ మధ్య కొందరు యాభై అరవై పేజీల కథల్ని కూడా చిన్న కథలు అని చలామణీ చేస్తున్నారు అని విమర్శించారు గుర్తుందా మీకు?" అన్నాను. బుచ్చిబాబుగారితో.

"గుర్తులేకేం! అతనూ యిక్కడే వున్నాడు! విమర్శకుల కాలనీ యిక్కడ వేరేవుంది! అప్పుడప్పుడు కనిపిస్తూ వుంటాడు. తన లాంటి విమర్శకులిప్పుడు భూలోకంలో లేకపోయారని సాహిత్య ప్రమాణాలు దిగజారిపోయాయని వాపోతూ వుంటాడు!' నవ్వారు బుచ్చిబాబు

"ఈరోజుల్లో ఆయన భూమిమీదవుండి చిన్నచిన్న కథల్ని రచయితలు వారాలకొద్దీ సాగదీసి నవల అంటూంటే ఏమనేవాడో!" నవ్వాను

అంతా నవ్వారు

"మీరూ మల్లాదివారూ యిప్పుడు భూమిమీదవుంటే మీ పెద్ద కథలన్నీ మాసపత్రికల అనుబంధాలుగా, నెలనెలా నవలలుగా వచ్చేవి కదా!" మళ్ళీ అన్నాను.

"అదేమిటి? ఆంధ్రదేశంలో చిన్నకథలరోజులు పోయా

దేమిటి ?" గురజాడ, బుచ్చిబాబు, తిలక్, మల్లాదివారు ఆదుర్దాగా ప్రశ్నించారు.

"చిన్న కథకీ, పెద్ద నవలకీ మధ్య 'చిన్న నవల' అనేది వొకటి పుట్టి ఆంధ్రదేశాన్ని యేలుతోంది!" జవాబిచ్చాను.

"అంతేకాదు! రచయితల నవలల్లో తమకు నచ్చని కొన్ని భాగాల్ని తామే కత్తిరించి ప్రచురించుకుంటామని అలా యిష్టమైతేనే తమ నవలల పోటీకి రచనలు పంపమని వో ప్రఖ్యాత వార పత్రిక విస్పష్టంగా ప్రకటించింది కూడా! అలావుంది చిన్న నవలల వ్యవహారం!" అన్నాను.

"అదేమిటి? రచయిత తన స్వాతంత్ర్యాన్నెలా వదులుకుంటాడు? రచనలో ఏది ముఖ్యమైందో, ఏది కాదో రచయితకి తెలుసా పత్రికాధికారులకి తెలుసా? ఎంత దారుణం! ఆత్మాభిమానం వున్న ఏ రచయితా ఆ పోటీలో పాల్గొని వుండడు! అవునా?" గురజాడ తీవ్రంగా అన్నారు.

"ఆ నిబంధనల కొప్పుకొని, చాలామంది ప్రఖ్యాత రచయిత్రి రచయితలే, తమ నవలల్ని ఆ పోటీకి పంపారు! ఈరోజుల్లో రచయితలకి హక్కులు, ఆదర్శాలు, అన్నవి పెద్దగా ముఖ్యమైనవికావు. ప్రచురణ కావడమే ముఖ్యం!" జవాబిచ్చాను నేను.

"ఏరా అబ్బీ! నువ్వు అకోవలోవాడివేనా ?" మల్లాదివారు కోపంగా అడిగారు.

"నేను పంపలేదండి" అంటూ నవ్వాను.

"అంటే పంపడానికి నీకేం అభ్యంతరంలేదన్నమాట. నీరచనా శక్తిమీద, రచనమీద నీకే నమ్మకంలేదన్నమాట. నువ్వు రాసిందాట్లో ముఖ్యమైందేదో ఆ పత్రికలవాళ్ళకే నీకన్నా బాగాతెలుసన్నమాట! అంతేనా ? సిగ్గు లేదూ నీకు?" కోపంతో మండిపడ్డారాయన.

విషయం మార్చాలనే వుద్దేశంతో బుచ్చిబాబుగారు "అవునూ యీమధ్య ఆంధ్రదేశంలో కళాప్రపూర్ణలూ, గౌరవ డాక్టరేట్‌లూ విరివిగా యిస్తున్నారటకదూ? ఈ సమయానికి మేమెవళ్ళం అక్కడ లేకపోయాం!" అని నవ్వారు.

"అవునండి యీమధ్య చాలామందికి క. ప్ర. లు యిచ్చారు. గౌ. డా. లు కూడా యిచ్చారు! ఇప్పుడు అసలు డాక్టర్లు ఎవరో, గౌ. డా. లు యెవరో, యెవరికీ తెలియకుండాపోతోంది!" నవ్వుతూ అన్నాను.

"మామీద యింత గౌరవం, అభిమానం అని యిన్నికబుర్లు చెబుతారు ఆ యూనివర్శిటీవాళ్ళతో చెప్పి మరణానంతరమేనా మాకూ ఆ గౌరవో, అగౌరవో యేదోవొక డాక్టరేట్ యిప్పించినారు కారుకదా?" గురజాడ అప్పారావుగారు నిష్ఠూరంగా అన్నారు.

తిలక్, బుచ్చిబాబు, మల్లాదివారూ ఘొల్లుమని నవ్వారు.

నవ్వాపుకుంటూ నేను "ఆ విషయమై మన యూనివర్శిటీలో నేనా పైరాష్ట్ర యూనివర్శిటీలో నేనా, ప్రయత్నం చేద్దామనుకున్నానండి! కాని నాకోరిక తీరకుండానే..." అంటున్నా.

"మనతో చేరాడు!" తిలక్ నవ్వుతూ పూర్తిచేశారు.

బుచ్చిబాబుగారితో నేను "మీనడివయస్సు నిఘంటువు అనే వ్యాసంలో షష్టి పూర్తి గురించి చెబుతూ "నాకు అంతకాలం నిలబడతానని తోచదు" అన్నారు. ఎందుకని ? అన్నాను.

నవ్వేరాయన! "ఎందుకంటే యేం చెప్పను! నడివయస్సు వచ్చినప్పటినుండి అంతం యింకెంతో దూరంలేదు అనిపిస్తూ వుంటుందేమో!" అన్నారు!

"అలా అనకు" అన్నా! శతధావిభిన్నమైన ఈ గుండెలో ఇంకా సంగీతం వినపడుతోంది. చావని నమ్మకం కలిగిస్తోంది. చావు లేదు నాకని ఎలుగెత్తి చాటాలనిపించింది" అనలేదూ 1964 లో ఈ బాలగంగాధరుడు! అతని కలా అనిపించినా 1966 దాటి భూమి మీది వుండగలిగాడా?" మల్లాది వారు నవ్వుతూ అన్నారు.

"ఒక్కొక్కప్పుడు వొక్కొక్క భావవీచిక అలా వీస్తుంది. అది రచయిత రచనల్లో ప్రతిఫలిస్తుంది! అంతే! దానికి వేరే ఆధారం


ఆంధ్ర సచిత్ర వార పత్రిక

— చందా వివరాలు —

విడి ప్రతి వెల ... 0-75 పైసలు

| | బ్యాంక్ ఏజెంటుద్వారా | | పోష్టుద్వారా | |
|---|---|---|---|---|
| | రు. | పై. | రు. | పై. |
| సంవత్సర చందా | 39- | 00 | 41 | 60 |
| అర్థ సంవత్సరం | 19 | 50 | 20- | 80 |
| మూడు మాసములకు | 9- | 75 | 10- | 40 |

మేనేజరు
ఆంధ్రపత్రిక

ఏమీ వుండదు!" బుచ్చిబాబు ఆకాశంలోకి చూస్తూ అన్నారు.

"మీకు తీరని కోరికలేవైనా వున్నాయా?" బుచ్చిబాబుగారి నడిగాను.

'బాపూ చేత లోపల బొమ్మలు వేయించినా చివరకు మిగిలేదిని అందమైన కాగితాల మీద చక్కగా ముద్రించాలనుకున్నాను. నా కోరిక తీరనేలేదు! నేనిక్కడకు వచ్చాక వో ప్రచురణ కర్త రెండు భాగాలుగా ప్రచురించాడట! లోపల బాపూ బొమ్మలూ లేవుట, కాగితాలూ బాగోలేవట!'! బుచ్చిబాబు దిగులుగా అన్నారు.

"మీ కేమండీ! మీవీ, మల్లాది వారివీ రచనలు ఎప్పటి కప్పుడు పుస్తకాలుగా వెలువడ్డాయి! కాని నావి?...నావి... నేనిక్కడి కొచ్చాక గాని పుస్తకంగా రాలేదు! నాదే గొప్ప ట్రాజడీ!" తిలక్ బాధగా నిట్టూర్చారు.

కాస్సేపు నిశ్శబ్దం రాజ్యమేలిందక్కడ.

"ఊరుకో శశీ! బాధపడకు! నువ్విప్పుడే యిక్కడకు వస్తాననుకున్నావా?" శశిమానసప్రియ ఓదార్చిందాయన్ని •

"ప్రపంచ పర్యటన వెయ్యాలని వుందని రాశారోసారి గుర్తుందా మీకు?" బుచ్చిబాబుగారినడిగాను.

"బుచ్చిబాబు అలా రాశాడా! మన మెవ్వరం భారతదేశం సరిహద్దులు దాటిపోనేలేదు! తెలుగు రచయితలంకదా!" మల్లాది వారన్నారు.

"నేను వెళ్ళా!" హటాత్తుగా అంది మధురవాణి!

అంతా ఆశ్చర్యంగా ఆమెవేపు చూసారు.

"అవును! 1965 ప్రాంతాలో కన్యాశుల్కం రష్యన్ భాషలో ముద్రించి మాస్కోలో ప్రకటించారు! అప్పుడు వెళ్ళా!' మధురవాణి గలగలా నవ్వింది!

'హమ్మ మధురం!" మల్లాదివారు ఆమె భుజం తట్టారు.

"మామా! మీలాంటి శిష్ట్లు సానివాళ్ళ శరీరం తాకకూడదు!' గురజాడ అన్నారు చిరాగ్గా!

"యేవిటి చిత్రం! యేం అప్రతిష్ఠ! బ్రాహ్మడికి నెత్తెత్తు తూదికాబోలు!" మధురవాణి కోపంగా చూసింది.

'తెలుగు రచయితలు తక్కువ వాళ్ళను కుంటున్నారా. ఈమధ్య దాశరథి నారాయణరెడ్డి మలేషియా వెళ్ళి, సాహిత్యోపన్యాసాలు యిచ్చి వచ్చారు. త్వరలో మలేషియాలో ద్వితీయ ప్రపంచ తెలుగు మహా సభలు' జరుగబోతున్నాయి. ఇప్పుడు లబ్ధ ప్రతిష్ఠులైన తెలుగు రచయితలకందరికీ విదేశపర్యటనయోగం పట్టబోతోంది! బుచ్చిబాబుగారు యిప్పుడు అక్కడవుంటే ఆయన కోరిక తప్పకుండా తీరేది!' నవ్వుతూ అన్నాను.

"ఏమయ్యా బుచ్చిబాబూ! నువ్వు అందరి గురించి పుట్టినప్పటి మొదటి మాటలు, వాళ్ళ చివరి మాటలు రాసేవాడివికదా! ఈ శాస్త్రిగారి మొదటిమాటలూ, చివరిమాటలూ చెప్పు!" అన్నారు మల్లాదివారు నావైపు చూపించి.

"ఈయన వ్యవహారం చూస్తే మొదటమాట 'ఆంధ్రత్వం, ఆంధ్రభాషచ నచ అల్పస్య తపసః ఫలమ్!' చివరిమాట 'చిన్నయ్య అంత చిన్న పుస్తకమైనా రాయలేక పోయానుకదా!' అన్నవి అయి వుంటుంది" బుచ్చిబాబు నవ్వుతూ అన్నారు

"ఒప్పుకుంటావురా అబ్బీ!" మల్లాదివారు నవ్వారు.

అయి వుంటుందన్నట్టు బుర్ర వూపాను.

"బుచ్చిబాబుగారు ఏమని వుంటారో చెప్పనా?" అడిగాను.

"చెప్పు! చెప్పు!" అంతా అన్నారు.

"మొదటి మాటలు" ఓ 'మాయ'నుంచి విముక్తిచెంది మరో 'మాయ'లో పడ్డాను!"

చివరి మాటలు " 'చివరకు మిగిలేది' ఏమిటి?" అన్నాను.

"హారి పిడుగా!" మల్లాదివారు నవ్వారు ప్రశంసాపూర్వకంగా చూస్తూ.

"నా గురించి బాగానే అర్థం చేసుకొన్నావే!" నవ్వారు బుచ్చిబాబు!

"మరేం మనుకున్నారు! మీరు నా అభిమాన రచయితల్లో వొకరు! మీకు వో కథని అంకితం యిచ్చిన తొలి తెలుగు కథకుణ్ణి నేను!" అన్నాను భుజాలు కదుపుతూ.

"అప్పుడే ఇక్కడిగాలి వంటబట్టిందే!" నండూరివారు నవ్వారు. నేనూ నవ్వి, సిగ్గుపడి, వూరుకొన్నాను.

"మరి తిలక్ ఏమని వుంటాడో చెప్పుచూద్దాం!" బుచ్చిబాబు కవ్వించారు.

"చెబుతాను చూడండి! మొదటి మాటలు... "ఎక్కడ ఏ పిచ్చి పొగడ నవ్వుగాలో పోతోంది!" చివరి మాటలు "ఆశల వెచ్చని పాన్పుమీద స్వప్నాల పుష్పాలు జల్లుకుని అదమరచి, శాశ్వతంగా నిద్రిస్తా!

"శహభాష్!" మెచ్చుకున్నారు మల్లాది శాస్త్రిగారు.

"మరి మల్లాది రామకృష్ణశాస్త్రిగారి గురించి చెప్పు!" తిలక్ అడిగారు నవ్వుతూ!

మొదటి మాటలు "శ్రీనాథుడి రోజుల్లో పుట్టకపోయానే." చివరి మాటలు. "అక్కడి సినిమాల్లో యింకా మంచి మాటలు, పాటలు రాయాలి!" నవ్వేశాను ఆపుకోలేక. అంతా ఘొల్లుమని నవ్వారు

"భలేరా అబ్బీ!" నా భుజం తట్టారు శాస్త్రిగారు మెచ్చుకుంటూ.

రాకేందు వదన మెచ్చుకోలుగా చూసింది.

ఏదో ఆలోచిస్తున్న బాలగంగాధరతిలక్‌ని చూసి, మల్లాదివారు "బాలగంగాధరా! ఏదేనా మంచి కవిత వొకటి వినిపించు" అన్నారు.

"ఏమి వినిపించను! ఏదీ వినిపించాలనిపించటం లేదు! సరే! . 'నేను నిర్మించుకున్న ఆశాచంద్రశాలలో కాలం కరిగి వెన్నెలయింది, నా భావం వీణా నిక్వాణమయింది. నా గీతం రటన్నట నూపుర నినాదమయింది. నేను యౌవనాన్ని, ఆనంద జీవన వనాన్ని, ఒక్క నిశాంత నీహారకణం సోకినా, ఒక్క కౌముదీ శీతల కిరణరేఖ జాల్వారినా, ఒక్క దయామయి అడుగు సవ్వడి పలకరించినా, కోటి పువ్వుల్ని పూస్తాను, కోటి నవ్వుల్ని జల్లుతాను!..."

"అబ్బ! ఏం భావుకత్వమోయ్!" మల్లాదివారు మెచ్చుకున్నారు.

శశిమానసప్రియ ఆరాధనా పూర్వకంగా ఆయనకేసి చూస్తోంది!

"అవును! అతని కవిత్వమే అంత! గాజు కెరటాల వెన్నెల సముద్రాల్లా, జాజిపువ్వుల అత్తరు దీపాల్లా, మంత్రలోకపు మణిస్తంభాల్లా, అతని కవితా చందనశాలా సుందర చిత్రచిత్రాలు! "అందుకే నాకంత యిష్టం!" బుచ్చిబాబు పొగిడారు

"మీలో యెవరుమాత్రం తక్కువవారు కాదు! ఒక్కొక్కరూ పరమ భావుక శేఖరులు. సుందరపద చిత్రరచనా సమర్థులు. తెనుగు సాహితీ నందనోద్యాన వనంలో వికసించిన సువర్ణ పుష్పాలు". ఆనంద బాష్పాలు తుడుచుకుంటూ అందరికీ అంజలి ఘటించాను.

"ఆదేవిటీ! అప్పుడే వందన సమర్పణ కార్యక్రమంలో కొచ్చేశావ్!" బుచ్చిబాబు నవ్వారు.

ఈ లోపల పెద్ద కలకలం వినిపించింది.. పెద్దగా ఉరుములు మెరుపులు ప్రారంభమయ్యాయి ... హఠాత్తుగా గాఢాంధకారం అలుముకొంది. ఏమీ కనిపించక కళ్ళు నులుముకొంటున్నాను.. కళ్ళు బరువుగా మూతలు పడిపోతున్నాయి...ఒళ్ళు తెలియడంలేదు...అగాధ జలాంధకార తరంగాలపై తేలుతున్నట్లుంది!...

( స మా ప్తం )

(ఈ రచనలో కీర్తిశేషులు మల్లాది రామకృష్ణశాస్త్రి గారు, నండూరి సుబ్బారావుగారు, గురజాడ అప్పారావుగారు, బుచ్చిబాబుగారు, తిలక్‌గారు. వీరి రచనలనుండి కొన్ని భాగాలను యథాతథంగా వాడుకున్నాను. ఇందుకు వారికి కృతజ్ఞుణ్ణి! ఇది వొట్టి ఊహాచిత్రణ మాత్రమే! కనుక ఇందులోని సంభాషణ వాక్యాలు కొన్ని నిజమైనవే కాని, చాలా ఊహాజనితాలే! ఇందుకు ఆ రచయితల బాధ్యతలేదు. ఇందులో యే వ్యక్తుల్నీ, సంస్థల్నీ కించపరచాలన్న దురుద్దేశం యీ రచయితకి లేదు. కొన్ని కొన్ని సంఘటనల్ని, విషయాల్ని, పాఠకుల దృష్టికి తీసుకురావడమే లక్ష్యం! ఈ అపూర్వ ప్రయత్నాన్ని సహృదయతతో పాఠకులు ప్రశంసిస్తారని ఆశిస్తున్నా!—రచయిత)

